
# హత్య

బి.పి.కరుణాకర్



సెలవురోజువస్తే ఏమీ తోచదు ఎంగేజిమెంట్సు ఏమీ లేకపోతే గదిలోకన్న ఆఫీసే నయం అనిపిస్తుంది కాలంగడవదు. పండుకుంటే నిద్రరావడంలేదు పెర్రీమేసన్ నవల తీశాను నాలుగు పేజీలు తిప్పేసరికి మెట్లమీద అలికిడైంది తలతిప్పేసరికి శిఖామణి గదిలోకి వచ్చాడు కుర్చీమంచం దగ్గరకులాగి కూర్చున్నాడు, ముందుకు వంగి.

"శ్రీనూ నాకో సహాయం చేసిపెట్టాలి" అన్నాడు.

పుస్తకంమూసి, "ఏమిటి?" అన్నాను.

శిఖామణి రెండు క్షణాలు తటపటాయించి ఎలా చెప్పాలో అర్థంకాక మౌనంగా ఉండిపోయాడు.

"చెప్పు" అన్నాను

"విస్కీ కావాలి" అన్నాడు.

ఉలిక్కిపడ్డాను.

లేచి కూర్చుని సిగిరెట్ వెలిగించాను.

"నిజం?"

"నిజం మనసు బాగోలేదు విస్కీయే కాదు మనస్సు కాసేపు ఈ లోకంనుండి తేలిపోవటానికి, ఏదోనా నన్ను ఇంటాక్సికేట్ చేసేది కావాలి." అన్నాడు.

పుస్తకం బల్లమీద పెట్టి రేడియో ఆన్ చేశాను కరెంటులేదు తిరిగి ఆఫ్ చేశాను. శిఖామణి కనీసం సిగిరెట్ ఐనా ముట్టుకోడు అటువంటివాడికి ఈ ఆలోచన ఎందుకు కలిగిందో నా కర్థం కావడంలేదు.

"ఇది హైదరాబాద్ కాదు ఇక్కడెలా దొరుకుతుంది" అన్నాను.

"ఎక్కడేనా సంపాయించాలి"

"శాంత దగ్గర్నుంచి ఉత్తరాలు రావడం లేదా?"

"కాదు. ఐ యామ్ లీస్ వరీడ్ ఎబౌట్ శాంత—ప్లీజ్, నా కోరిక కాదనకు."

"ఇంతకూ ఎక్కడేనా సంపాయించమంటావ్. అంతేనా?"

శిఖామణి తల వూపి, "ఆ భారం నీది" అన్నాడు.

"ఎలా?"

"కాళిదాసు లేడూ?" అన్నాడు.

శిఖామణి పుస్తకం అటు వెపు చూస్తున్నాడు. సిగిరెట్ వెలిగించాను శిఖామణి తలెత్తి సిగిరెట్ పొగవంక చూస్తుండిపోయాడు ఫేన్ గాలికి పొగ తిరిగి తిరిగి మాయమైంది

మా ఆఫీసుతో కాళిదాసుకు పని ఉండటం వలన అందులో అతని పే ఎకౌంటు నేనే చూస్తుండంవలన కాళిదాసుతో నాకు పరిచయం అయింది కాళిదాసుకు ముప్ఫైఐదు సంవత్సరాలుంటాయి ఎనిమిది వందల పై చిలుకు అతని జీతం పెళ్లికాలేదు అతను మా ఆఫీసుకు వచ్చినప్పుడలా నా డస్క్ దగ్గరకువచ్చి చాల ఫ్రీగా మాటాడేవాడు. కాని డబ్బున్నవాళ్లతో, పెదవాళ్లతో మాట్లాడుతుండేప్పుడు ఎందుకో నేరం చేసినట్లు బాధపడేవాడిని. "నువ్వే మా క్వార్టర్సుకు వోసారి రాకూడదూ" అనేవాడు. 'వస్తానులెండి'అని చెప్పేవాణ్ణి కాని ఎప్పుడూ వెళ్ళాలనిపించలేదు. కాళిదాసుకు పర్మిట్ వుంది. ఆ సంగతి శిఖామణికి కూడా తెలుసు

గుడ్డలు మార్చుకుని సైకిలు తీసుకుని కాళిదాసు ఇంటికి బయలేరాను. సమయానికి కాళిదాసు ఇంట్లోనే ఉన్నాడు కాఫీ ఇచ్చాడు కొద్దిసేపు పిచ్చాపాటి మాట్లాడి అసలు నేను వచ్చిన సంగతి ఎలా వ్యక్తం చేయాలో అర్థంకాక సందిగ్ధంలో ఉండిపోయాను

కాళిదాసు ఏదో చెబుతున్నవాడల్లా ఆగి, నా ముఖంలోకి పరీక్షగా చూశాడు "ఏమిటి దీర్ఘాలోచంలో పడిపోయావు?" అన్నాడు

"అసలు—మీ దగ్గరకు ఎందుకు వచ్చానో చెప్పమంటారా?" అన్నాను

"చెప్పు"

"నాకు విస్కీ కావాలి" అన్నాను ఆయన ముఖంలోకి పరీక్షగాచూస్తూ

కాళిదాసు పెద్దగా నవ్వి, "అంతేనా" అన్నాడు.

"అవును"

"చెడిపోతున్నావ్" అని కుర్చీలో చేరగిలబడి "ఏ మేడ్ కావాలి—ఫారెన్ స్టఫ్ ఆర్ ఇండియన్?" అన్నాడు.

"ఏది బాగుంటుంది?"

"మునుపు ఎప్పుడూ తాగలేదా?"

"ఉహూ" తల అడ్డంగా ఆడించాను.

"అయితే తాగకు"

"రుచి చూద్దామని ఉంది—ఒక్కసారికి"

"అలవాటు కాకుంటే మంచిది. అలవాటు చస్తున్నాను—ఈ ఒక్కసారికే అంటున్నావు కాబట్టి ఇస్తాను రెండోసారంటే నావల్లకాదు సరేనా"

జేబులోంచి డబ్బుతీసి "ఏమవుతుంది?" అన్నాను

"ముందు ఆ రూపాయలు నీ జేబులో పెట్టుకో"

"చెప్పండి"

"చెబుతాగాని ముందు నీ డబ్బు నీ జేబులో ఉంచుకో"

డబ్బు జేబులో పెట్టుకునాను.

"నువ్వు పూర్తిగా చెడిపోతున్నావోయ్" అన్నాడు నవ్వుతూ

"తిరిగి ఎప్పుడు రమ్మంటారు?"

"రేపు సాయంత్రం రా" అన్నాడు.

"థాంక్స్ చెప్పి బైటకు వచ్చాను గదికి చేరేసరికి శిఖామణి గదిలోనే ఉన్నాడు చేతిలో సిగిరెట్ ఉంది. బల్లమీద సిగిరెట్ పేకెట్, అగ్గిపెట్టా ఉన్నాయి. ఆశ్చర్యంతో చాలాసేపటివరకు నానోటి వెంట మాట రాలేదు.

"ఏమిట్రా" అన్నాడు శిఖామణి

మంచంమీద కూర్చుని బూట్లు విప్పుకుంటుంటే నా ముందుకువచ్చి, కాయా పండా?" అన్నాడు.

"పండే"

"ఏది?"

"రేపు ఇస్తానన్నాడు"

"ఈరోజు కాదన్నమాట." శిఖామణి నీరుకారిపోయాడు

"అయినా మణీ—ఇదేమిట్రా—ఈ సిగిరెట్లు. నాకేం అర్థంకావడంలేదు" అన్నాను శిఖామణి కళ్లలోకి చూస్తూ.

శిఖామణి బాధగా నవ్వాడు చూపు తప్పించుకుని వెళ్లి కుర్చీమీద కూర్చుని రేడియో ట్యూన్ చేశాడు. గరగర శబ్దం వినిపిస్తుంది.

ఆ మరుసటిరోజు సాయంత్రం ఆఫీసు నుండి సరాసరి కాళిదాసు ఇంటికివెళ్లాను. కాళిదాసు అప్పుడే ఎక్కడికో బయల్దేరుతున్నాడు

"తీసుకువచ్చారా?" అడిగాను.

"అరే మర్చేపోయాను డోన్ట్ థింక్ అదర్ వైజ్ రేపు ఉదయాన్నేవచ్చి తీసుకు వెళ్లు. నేనున్నా లేకపోయినా ఇంట్లో కుర్రాడికి చెప్తాను" అన్నాడు

ఆ రాత్రి పొద్దుపోయాక శిఖామణి గదికి చేరుకున్నాడు కళ్లు ఎర్రగాఉన్నాయి. గుడ్డలు మాసిపోయి ఉన్నాయి గదిలోకి అడుగుపెడూనే "తీసుకువచ్చావా?" అన్నాడు

"రేపు" అన్నాను.

"ఎందుకేమిటి?"

"ఆయన మర్చిపోయాడట."

శిఖామణి గుడ్డలు మార్చుకుని మంచం మీద పడుకుని తెరచిఉన్న కిటికీలో గుండా బైటకు చూస్తుండిపోయాడు. చల్లటిగాలి వీస్తుంది

ఆఫీస్ మేన్యుల్‌లో నా తల మునకవుతుంటే,

"అరె శీనూ" అన్నాడు శిఖామణి.

"ఆ"

"రేపు ఖచ్చితమేకద"

తలూపాను

రెండు క్షణాలు మౌనంగా ఉండి, "చచ్చిపోదామనిపిస్తుందిరా" అన్నాడు.

ఉలిక్కిపడాను.

ఆఫీసు మేన్యుల్ మూసి బల్లమీద పెట్టాను. సిగిరెట్ వెలిగించి "దేనికి?" అడిగాను.

"ఈ ఉద్యోగం వదిలిపెట్టి, ఇక్కడ్నుంచి వెళ్లిపోవాలనిపిస్తుంది. నిజం" అన్నాడు.

"ఏదో జరిగింది. నువ్వేదో పీకలోతు వావు. చెప్పు ఏం జరిగింది?"

శిఖామణి పెదాలు కదిపి ఏదో చెప్పబోయి ఆగిపోయాడు రెండు చేతుల్లో ముఖం కప్పుకుని వెక్కి వెక్కి ఏడవసాగాడు.

ఆ మరుసటిరోజు ఉదయం కాళిదాసు

...ంటికి వెళ్ళాను. నన్ను చూడగానే "సారీ మాస్టర్. విస్కీ వసుల తొందరో... . సాయంత్రం ష్యూర్" అన్నాడు కాళిదాసు నా చేతిలో చెయ్యివేసి సాయంత్రం కాళిదాసు ఇంటికి వెళ్ళాను కాళిదాసులేడు పని కుర్రాడిని అడిగితే తనకు తెలీదన్నాడు గదికి చేరుకునేసరికి శిఖామణి మత్తుగా

# హఠాత్

పడుకుని ఉన్నాడు బల్లమీద త్రీస్టార్స్ సీసా ఉంది.

నాలుగు రోజుల తర్వాతనుకుంటాను— ఆఫీసునుండి గదికి చేరేసరికి శిఖామణి బెడ్ ఖాళీగా ఉంది. బల్లమీద ఓ చిన్న కాయితం, మడతలు పెట్టి పౌడరు డబ్బా క్రింద ఉంది ఆత్రంగా విప్పాను అక్షరాలు గజిబిజిగా ఉన్నాయి.

ప్రియా!

చెప్పకుండా వెళ్ళిపోతున్నందుకు నన్ను క్షమిస్తావు కదూ అనుకోకుండా జీవితాలు ఎందుకు మలుపు తిరిగిపోతుంటాయో నాకు అర్థం కావడంలేదు ముందు హైదరాబాద్ వెళ్ళి తర్వాత మా వూరు వెళ్తాను. తిరిగి వస్తానో రానో ఇప్పుడు చెప్పలేను...

క్రింద సంతకంలేదు పెన్ పాళీ చిట్లిపోయిన గీతలున్నాయి ఆ ఉత్తరాన్ని ఒకటికి నాలుగుసార్లు చదివాను శిఖామణి హఠాత్తుగా ఎందుకు వెళ్ళిపోవలసివచ్చిందో ఎంత ఆలోచించినా నా వూహకు అందలేదు.

రాత్రి తొమ్మిది గంటలవరకు గదిలో కూర్చున్నాను ఏమీ చేయలేకపోతున్నాను ఏమీ చేయకుండా ఉండ బుద్ధి కావడంలేదు. నా ఆలోచనలో శిఖామణి మాటిమాటికి కదులుతున్నాడు. సూయిసైడ్ లాంటి ఏకాంతాన్ని భరించలేకపోయాను. గదికి తాళంవేసి సినిమాకు బయల్దేరాను నే వెళ్ళేసరికి ఆట మొదలైంది టికెట్ తీసుకుని మేడ ఎక్కి ఓ మూల కూర్చున్నాను.

ఇంకో ఐదు నిమిషాలలో ఇంటర్వెల్ అనగా నా వెనకాలనుండి మాటలు చిన్నగా వినిపించసాగాయి

"నే నొకడికి హాత్ ఇచ్చాను" అంది ఓ మగ గొంతు.

"దేనికి" స్త్రీ గొంతు సన్నటి ప్రశ్న

"విస్కీ కావాలన్నాడు రేపు మాపు, ఇదో అంటూ తిప్పాను విసుగుపుట్టి రాలేదు"

నవ్వు.

గాజుల గలగల.

వెనకకు తిరిగిచూశాను.

లైట్లు వెలిగాయి

ఆ వ్యక్తి కాళిదాసు ఆ క్షణం కాళిదాసు ఎంతో గంభీరంగా ఉండవచ్చు. కాని అతని ముఖంలో కత్తివేటుకు నెత్తురు చుక్కలేదు నేనందుకు నిరుత్తరుణ్ణి కాలేదు కాని, అతని ప్రక్కనవున్న స్త్రీ

—శాంత ●

